వాడీ వేడిగా సూర్యాపేట మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

బొడ్రాయిబజార్, జూన్ 27 : సూర్యాపేట మున్సిపల్ కార్యాలయంలో గురువారం జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం వాడీ వేడిగా సాగింది. ఉదయం 11 గంటలకు ప్రారంభమైన సమావేశం సాయంత్రం 6 గంటల వరకు కొనసాగింది. మొత్తం 63 అంశాలను సమావేశంలో ప్రవేశపెట్టగా 61 అంశాలను ఆమోదించిన సభ్యులు రెండు అంశాలను తిరస్కరించారు. కొన్ని వార్డుల్లో ప్రతిపాదించిన పనులను నిలుపుదల చేశారు. అధికారులు అజెండా అంశాలను చదువుతున్న క్రమంలో ప్రతిపక్ష కౌన్సిలర్లు ప్రతి అంశంపై సమస్యను లేవనెత్తారు. బీఆర్ఎస్ కౌన్సిలర్లు మాత్రమే పట్టణ ప్రగతి నిధులను వార్డుకు రూ. 5లక్షల చొప్పున కేటాయించుకున్నారని మిగతా కౌన్సిలర్లకు ఎందుకు కేటాయించలేదని కాంగ్రెస్, బీఎస్పీ, బీజేపీ కౌన్సిలర్లు ప్రశ్నించారు. మున్సిపల్ చైర్పర్సన్ అన్నపూర్ణ సమాధానమిస్తూ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఇచ్చిన రూ.3.35 కోట్లను కేవలం 31 మంది కౌన్సిలర్లు మాత్రమే పంచుకున్నారని, మిగతా 17 మంది కౌన్సిలర్ల వార్డుల్లో కూడా అభివృద్ధి జరుగాలనే ఉద్దేశంతో పట్టణ ప్రగతి నిధులు కేటాయించినట్లు తెలిపారు. సూర్యాపేటకు గతంలో మండు వేసవిలో సైతం మిషన్ భగీరథ నీరు అందించామని, నేడు జనాభా ప్రాతిపదికన రావాల్సిన నీరు కోదాడ, హుజూర్‌నగర్‌కు తరలి వెళ్తున్నాయని, సూర్యాపేటకు తక్కువ నీరు రావడంతో ప్రజలు తీవ్ర నీటి ఎద్దడి ఎదుర్కొంటున్నారని దీనిపై కాంగ్రెస్ కౌన్సిలర్లు ఎందుకు మాట్లాడడం లేదని పలువురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు ప్రశ్నించారు. ప్రజలు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని సమస్యలను పరిష్కరించే దిశగా అభివృద్ధిలో భాగస్వాములయ్యేందుకు కౌన్సిల్ సభ్యులంతా కలిసి రావాలని మున్సిపల్ చైర్పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ విజ్ఞప్తి చేశారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్, వైస్ చైర్మన్ పుట్ట కిశోర్, ఈఈ జీకేడీ ప్రసాద్, డీఈ సత్యారావు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

వెనక్కి వెళ్లిన రూ.80కోట్లపై ఎందుకు మాట్లాడరు

- దళిత చైర్పర్సన్‌ను అణిచివేసేందుకు కాంగ్రెస్ కౌన్సిలర్ల ప్రయత్నం
- అన్ని వార్డులకు సమానంగా నిధులు కేటాయింపు
- విలేకరుల సమావేశంలో మున్సిపల్ చైర్పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ


విలేకరులతో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్పర్సన్ అన్నపూర్ణ

బొడ్రాయిబజార్, జూన్ 27 : సూర్యాపేట పట్టణ అభివృద్ధి కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన ఎస్‌డీఎఫ్, యూడీఎఫ్ నిధులు రూ.80కోట్లు పనులు ప్రారంభమైన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక వెనక్కి వెళ్లాయి. ఈ విషయమై కాంగ్రెస్ కౌన్సిలర్లు ఎందుకు మాట్లాడడం లేదని సూర్యాపేట మున్సిపల్ చైర్పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ ప్రశ్నించారు. ప్రస్తుతం వచ్చిన రూ.3.35కోట్ల గురించే మాట్లాడడం విచారకరమన్నారు. గురువారం సూర్యాపేట మున్సిపల్ సాధారణ సమావేశం అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. ప్రతిపక్ష కౌన్సిలర్లు ప్రతి అంశాన్ని వివాదం చేయడమే లక్ష్యంగా సమావేశానికి వచ్చారని, చైర్పర్సన్ అంటే కనీస గౌరవం లేకుండా ఇష్టానుసారంగా మాట్లాడారని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగున్నర ఏండ్లుగా సూర్యాపేట అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నాన్నారు. పదేండ్లుగా మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి రూ.1500 కోట్లతో పట్టణాన్ని అభివృద్ధి చేసిన విషయాన్ని కౌన్సిలర్లు గుర్తు పెట్టుకోవాలన్నారు. అవిశ్వాసం పెట్టిన కౌన్సిలర్లు తనపై దాడి చేసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. అందరినీ కలుపుకొని పోవడమే తనకు తెలసని, పట్టణంలోని 48 వార్డులు తనకు సమానమేనని అన్నారు. గతంలో ఉన్న కౌన్సిలర్లే ప్రస్తుతం ఉన్నారని, అభివృద్ధి విషయంలో అప్పుడు మాట్లాడని వారు ఇప్పుడు గోల పెట్టడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు కేటాయించిన రూ.3.35 కోట్ల నిధులు కేవలం 31 మంది కౌన్సిలర్లు మాత్రమే పంచుకోవడంతో మిగతా వార్డుల్లో కూడా అభివృద్ధి జరుగాలనే ఆలోచనతో మిగతా 17 మంది కౌన్సిలర్లకు పట్టణ ప్రగతి నిధులు రూ. 5లక్షలు కేటాయించినట్లు చెప్పారు. జనాభా ప్రాతిపదికన సూర్యాపేటకు రావాల్సిన మిషన్ భగీరథ నీటిని కోదాడ, హుజూర్‌నగర్ ప్రాంతాలకు తరలిస్తుంటే ఈ విషయమై ఒక్కరూ మాట్లాడడం లేదన్నారు. అవినీతిపై చర్చకు తాము సిద్ధమేనని, సూర్యాపేట జిల్లా కేంద్రంలో రోడ్ల వెడల్పు, సుందరీకరణ జరుగడంతో వ్యాపారం మంచిగా సాగుతూ ప్రజలు ఆనందంగా ఉన్నారని తెలిపారు. బీజేపీ, కాంగ్రెస్, బీఎస్పీ కౌన్సిలర్లు ఏకమై కౌన్సిల్ సమావేశంలో ప్రజా సమస్యలపై మాట్లాడనీయకుండా ప్రతి అంశాన్ని రాద్ధాంతం చేయడం కౌన్సిల్‌ను అగౌరవపర్చడమే అన్నారు. కొందరు అధికారులను తొత్తులుగా మార్చుకొని తనకు తెలియకుండా కార్యక్రమాలు చేస్తున్నారని. దీనిని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. టౌన్ ప్లానింగ్ సెక్షన్ నుంచి దాదాపు 200 ఇండ్లకు నోటీసులు వెళ్లినట్లు తమకు సమాచారం ఉందని, సెక్షన్‌లో అడిగితే 30 మందికే ఇచ్చామని చెబుతున్నారని మిగతా నోటీసులు ఎవరు ఇచ్చారని ప్రశ్నించారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో జరుగుతున్న అరాచక పాలనతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఆమె వెంట కౌన్సిలర్లు మడిపల్లి విక్రమ్, చింతలపాటి భరత్ మహాజన్, తాహెర్‌పాషా, ఆకుల కవిత, వల్దాస్ సౌమ్య, కోఆప్షన్ సభ్యుడు వెంపటి సురేశ్ ఉన్నారు.

విజేతలలకు బహుమతులు అందించిన చెస్ అసోయేషన్ సభ్యులు

చెస్ పోటీల విజేతలకు బహుమతులు

కోదాడ రూరల్, జూన్ 27: మేకల అభినవ్ జ్ఞాపకార్థం జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి చెస్ పోటీలు గురువారం ముగిశాయి. అండర్ – 15, 13, 11, 9, 7 విభాగాల్లో బాల, బాలికలకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పెద్దిరెడ్డి గణేశ్, పారుగళ్ల చంద్రశేఖర్, సభ్యుడు లెక్కల నిరంజన్‌రెడ్డి, అభినవ్ తల్లిదండ్రులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ కార్మికుల సంఘం కార్యవర్గం ఎన్నిక

మఠంపల్లి, జూన్ 27 : మండల గ్రామపంచాయతీ కార్మికుల సంఘం కమిటీని గురువారం సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ రన్‌మియా అధ్యక్షతన ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మామిడి అంజయ్య, ఉపాధ్యక్షుడిగా మామిడి తిరపతయ్య, కార్యదర్శిగా మంగళపల్లి మధు, సహాయ కార్యదర్శిగా దాసరి సుదర్శన్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రన్‌మియా మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో సంఘం మండల కార్యదర్శి మైసయ్య, నాయకులు దేవాదానం, గురువారెడ్డి, కంటు నాగయ్య, నందిపాటి శ్రీను, పోతబత్తిని రాకేశ్, మేకల చిన్నపురెడ్డి పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

ఒరిజినల్ లింకు డాక్యుమెంట్స్ పోయినవి

ఆంగోత్ రాజి W/o. శక్రు, R/o.ఆంగోత్ తండ H/o.చెన్నారం గ్రా॥ కొండమల్లెపల్లి (మం) నల్లగొండ (జి) నివాసికి చెందిన లింకు డాక్యుమెంట్స్ (No.4063/2022, 4603/2022 & 1483/2012) తేది:16.06.2024 నాడు దేవరకొండ పట్టణం & మం॥లో Xeroxకి వెళ్తుండగా పోయినవి దొరికినవారు సంప్ర॥9959452029.

NLG-

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...

ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount
5% GST అదనం

నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం,
గ్రా॥ చర్లపల్లి, మం॥ నల్లగొండ.

నల్లగొండ : 9182777626	నల్లగొండ : 9182777635	దేవరకొండ : 9182777635
హాలియా : 9182777059	సూర్యాపేట : 9182777630	భువనగిరి : 9182777638
మిర్యాలగూడ : 9182777059	కోదాడ : 9182777196	యాదగిరిగుట్ట : 9182777638

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

ఈవీఎంల గోదాం వద్ద రాజకీయపార్టీల ప్రతినిధులతో కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

సూర్యాపేట, జూన్ 27 : సీజనల్ వ్యాధుల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా, మండల స్థాయి అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాకాలం ప్రారంభమైనందున గ్రామ పంచాయతీల్లో జ్వరాలు, అంటు వ్యాధులు ప్రబలకుండా వైద్యాధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రోగ రహిత గ్రామ పంచాయతీలుగా తీర్చిదిద్దటమే మన లక్ష్యమని, దీనిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పీహెచ్‌సీల్లో మందులు, టెస్టింగ్ కిట్స్ అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. డెంగీ, మలేరియా, వైరల్ జ్వరాలు ప్రబలకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామ పంచాయతీల్లో ప్రతిరోజూ పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. వాటర్ ట్యాంక్‌లను ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయాలని, దోమల నివారణకు ఫాగింగ్, మందుల పిచికారీ చేపట్టాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీల్లో పల్లె ప్రకృతి వనాలు, వైకుంఠ ధామలు, సెగ్రిగేషన్ షెడ్ల నిర్వహణపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జూలై ఒకటో తేదీ నుంచి వనమహోత్సవం ప్రారంభం కానున్న దృష్ట్యా జిల్లాలో గుర్తించిన ప్రాంతాల్లో మొక్కలు నాటాలని సూచించారు. మహిళా శక్తి పథకం ద్వారా 14 రకాల పనుల్లో మహిళలకు శిక్షణ ఇప్పించి స్వశక్తితో జీవించేలా ప్రోత్సహించనున్నట్లు తెలిపారు. జిల్లాలో 11,000 మందికి ఈ పథకం ద్వారా ఆర్థికంగా బలోపేతం చేయనున్నట్లు చెప్పారు. సమావేశంలో జడ్పీ సీఈఓ అప్పారావు, డీఆర్‌డీఓ మధుసూదన్ రాజు, డీఎఫ్ఓ సతీశ్‌కుమార్, డీపీఓ సురేశ్‌కుమార్ పాల్గొన్నారు.

వీవీప్యాట్ల అడ్రస్ ట్యాగ్ తొలగింపు

సూర్యాపేట : ఎన్నికల్లో వినియోగించిన 1,214 వీవీ ప్యాట్ల నుంచి ధర్మల్ పవర్ రోల్స్, అడ్రస్ ట్యాగ్‌ల తొలగింపు కార్యక్రమం చేపట్టినట్లు కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తెలిపారు. గురువారం కలెక్టరేట్ ఆవరణలోని ఈవీఎంల గోదాంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ట్యాగ్‌లను తొలగించారు. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో ఏబీ కేటగిరీకి చెందిన వీవీ ప్యాట్ల నుంచి ట్యాగ్‌లు తొలిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ శ్రీనివాస రాజు,

డీటీ వేణు, రాజకీయ పార్టీల ప్రతినిధులు చకిలం రాజేశ్వరరావు, కోట గోపి, బీద్, రమేశ్, సత్యనారాయణ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

అనంతగిరి, జూన్ 27: మండలంలోని వసంతపురం ఆవాస గ్రామం తెల్లబండతండాకు చెందిన బాణోతు సోమ్లా (50) గురువారం విద్యుదాఘాతంతో మృతి చెందాడు. బాణోతు సోమ్లా ఉదయం గ్రామ శివారులో ఉన్న రామయ్యకు చెందిన మామిడి తోట వద్దకు వెళ్లాడు. తోటకు వేసిన ఫెన్సింగ్ తీగలకు విద్యుత్ ప్రవహిస్తుండటం, సదరు తీగలు సోమ్లాకు తగలడంతో విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నవీన్‌కుమార్ తెలిపారు.

అతిథి అధ్యాపకుడి కోసం దరఖాస్తులు

హుజూర్‌నగర్, జూన్27 : హుజూర్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుడి నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎం. భీమార్జున్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కంప్యూటర్ సైన్స్ విభాగంలో ఒక పోస్టు ఖాళీగా ఉన్నదని పేర్కొన్నారు. పీజీలో 55శాతం మార్కులతో ఉత్తీర్ణులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పీహెచ్‌డీ, నెట్, సెట్, బోధనా అనుభవం కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు జూలై 5లోపు కళాశాలలో దరఖాస్తు అందించాలని సూచించారు.

నేడు నాగారం మండల సర్వసభ్య సమావేశం

నాగారం, జూన్ 27 : మండల సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కూరం మణీ వెంకన్న అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ దారా శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మందుల సామేలు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. సమావేశానికి గ్రామ ప్రత్యేకాధికారులు, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని సూచించారు.

ప్లాస్టిక్‌తో పర్యావరణానికి ముప్పు : శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్

హుజూర్‌నగర్, జూన్ 27 : సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్‌తో పర్యావరణానికి ముప్పు పొంచి ఉందని శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం. అశోక్‌కుమార్ అన్నారు. గురువారం మున్సిపాలిటీ కార్యాలయంలో పట్టణంలోని వర్తకులకు ప్లాస్టిక్ నివారణపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. వ్యాపారులు ప్లాస్టిక్ వాడాకాన్ని తగ్గించాలన్నారు. సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్‌ను విక్రయించినా, వినియోగించినా లైసెన్స్‌ను రద్దు చేయడంతో పాటు చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

నాగారం, జూన్ 27 : మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో గురువారం ఎస్ఐ వెంకట్‌రెడ్డి సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆపద సమయంలో, ఏదైనా సమస్య తలెత్తితే వెంటనే 100కు డయల్ చేయాలని సూచించారు. ఆయన వెంట ఏఎస్ఐ వెంకటరాములు, ప్రవీణ్‌రెడ్డి, వీరన్న ఉన్నారు.

ఆరు గ్యారెంటీలను చిత్తశుద్ధితో అమలు చేయాలి

- సీపీఐ నాయకుడు ధనుంజయనాయుడు

నేరేడుచర్ల, జూన్ 27 : రాష్ట్ర ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీల హామీని చిత్తశుద్ధితో అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధూళిపాల ధనుంజయనాయుడు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని పోడు భూముల రైతులకు పట్టాలిచ్చి వారికి రైతు బంధు, రైతుబీమా పథకాన్ని వర్తింపజేయాలన్నారు. రెండు లక్షల రుణమాఫీని ఆగస్టు 15 లోపు పూర్తి చేయాలని, మహిళలకు రూ. 2500 ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మహిళా సమాఖ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను, ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకుడు కొమర్రాజు వెంకట్, నరసమ్మ పాల్గొన్నారు.

అనుమతి ఉన్న డీలర్ల వద్దే విత్తనాలు కొనాలి

- డీఏఓ శ్రీధర్‌రెడ్డి

రికార్డులను పరిశీలిస్తున్న డీఏఓ శ్రీధర్‌రెడ్డి

ఆత్మకూర్.ఎస్, జూన్ 27 : వ్యవసాయశాఖ అనుమతి పొందిన డీలర్ల వద్దే రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి శ్రీధర్‌రెడ్డి సూచించారు. గురువారం మండలంలోని నెమ్మికల్ గ్రామంలో వ్యవసాయ విస్తరణ అధికారులు చేస్తున్న పంటల నమోదును పరిశీలించారు. మన గ్రోమోర్ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వానకాలం రైతులు పండిస్తున్న పత్తి, వరి, పెసర పంటల వివరాలు సర్వే నంబర్ల వారీగా పంట పేరు, రకం, పంట వేసిన తేదీ, నీటి వసతి వంటి వివరాలను నమోదు చేయాలని ఏఈఓలకు సూచించారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేసిన వెంటనే రైతులకు తప్పక బిల్లు ఇవ్వాలని మన గ్రోమోర్ సిబ్బందికి సూచాంచారు. రైతులు బిల్లును, విత్తన ప్యాకెట్లను పంటకాలం పూర్తయ్యే వరకు తమ వద్దే భద్రపర్చుకోవాలన్నారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి దివ్య, వ్యవసాయ విస్తరణ అధికారి శివకుమార్ ఉన్నారు.

భాషా పండితులకు పదోన్నతులపై హర్షం

నేరేడుచర్ల, జూన్ 27 : భాషా పండితులకు రాష్ట్ర ప్రభుత్వం పదోన్నతులు కల్పించడం హర్షణీయమని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ జిల్లా అధ్యక్షుడు తాటికొండ రామ్మూర్తి అన్నారు. గురువారం నేరేడుచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భాషా పండితులకు అందించిన పదోన్నతుల ఆర్డర్ కాపీని ప్రధానోపాధ్యాయుడు బట్టు మధుతో కలిసి అందించి మాట్లాడారు. తెలుగు, హిందీ సబ్జెక్టులు బోధించే స్కూల్ అసిస్టెంట్ల పోస్టులు మారడంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడంతో పాటు భాషా పండితుల ఆత్మ గౌరవం పెరుగుందని పేర్కొన్నారు.

పలువురికి ఎమ్మెల్యే సామేల్ పరామర్శ


అంజమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సామేల్

అర్వపల్లి, జూన్ 27 : మండలంలోని ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన పిట్టల పాపమ్మ ఇటీవల మృతి చెందింది. గురువారం ఎమ్మెల్యే మందుల సామేల్ గ్రామానికి వెళ్లి పాపమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించారు. రూ.10వేల ఆర్థికసాయం అందించారు. మండల కేంద్రానికి చెందిన బింగి అంజమ్మ ఇటీవల మృతి చెందగా ఎమ్మెల్యే ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. రూ.5వేల ఆర్థిక సాయం అందించారు. ఎమ్మెల్యే వెంట నాయకులు అనిల్ రెడ్డి, రాజేందర్‌రెడ్డి, మోరపాక సత్యం, ఇందూర్తి వెంకటరెడ్డి, నర్సింగ శ్రీనివాస్‌గౌడ్ ఉన్నారు.

ఏఎన్ఎంల సేవలు వెలకట్టలేనివి

- జడ్పీటీసీ మామిడి అనితాఅంజయ్య

ఏఎన్ఎంను సన్మానిస్తున్న జడ్పీటీసీ అనితాఅంజయ్య

పెన్‌పహాడ్, జూన్ 27 : కరోనా కష్ట కాలంలో ఏఎన్ఎంలు ప్రజలకు అందించిన సేవలు మరువలేనివని జడ్పీటీసీ మామిడి అనితా అంజయ్య అన్నారు. గురువారం మండలంలోని అనంతారం ఏఎన్ఎంగా పని చేసి పదవి విరమణ పొందుతున్న జానమ్మను జడ్పీటీసీ ఘనంగా సన్మానించారు. కార్యక్రమములో ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రావు, మండల వైద్యాధికారి స్రవంతి, సూపరింటెండెంట్ చంద్రశేఖర్‌రాజు, ఎంపీటీసీ మామిడి రేవతి, కార్యదర్శి రాజేశ్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

థర్మల్ పవర్‌హౌస్ నిర్మాణ అవకాశం టీజీ జెన్కోకి ఇవ్వాలని వినతి

చింతలపాలెం, జూన్ 27 : రామగుండంలో 800 ఎమ్‌డబ్లూ థర్మల్ పవర్ హౌస్ నిర్మాణ అవకాశాన్ని టీజీ జెన్కోకి ఇవ్వాలని పులిచింతల విద్యుత్ జేఏసీ నాయకులు, ఉద్యోగులు గురువారం ఎస్ఈ దేశ్యా నాయక్‌కు వినతి పత్రం అందించారు. విద్యుత్ ఉత్పాదన టీజీ జెన్కోకి సంబంధించిన అంశమని, అందుకు కావాల్సిన స్థలం, సదుపాయాలు ఇప్పటికే రామగుండంలో టీజీ జెన్కో వద్ద ఉన్నాయని తెలిపారు. టీజీ జెన్కో స్థలాన్ని సింగరేణికి ప్రభుత్వం అప్పగించడంపై విద్యుత్ ఉద్యోగులు అసంతృప్తితో ఉన్నారన్నారు. దీనిని ఉపసంహరించుకోకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

సహకార బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి : మేనేజర్

బ్యాంక్ సేవలపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

మేళ్లచెర్వు, జూన్ 27 : సహకార బ్యాంక్ ద్వారా వివిధ వర్గాలకు అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని బ్యాంక్ మేళ్లచెర్వు శాఖ మేనేజర్ షేక్. మహమూద్ సూచించారు. గురువారం మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో బ్యాంక్ ద్వారా రైతులకు అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించారు. బ్యాంక్ వ్యవసాయ అనుబంధ రుణాలతో పాటు గోల్డ్ లోన్, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, లాకర్ సదుపాయం కల్పిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ అబ్దుల్‌రఫీ, సతీశ్, క్రాంతి పాల్గొన్నారు.

ధ్వజ స్తంభానికి జలాభిషేకం

నాగారం, జూన్ 27 : మండలంలోని పసునూరు గ్రామంలోని భ్రమరాంబికా సమేత మల్లికార్జునస్వామి దేవాలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా గురువారం ధ్వజస్తంభానికి మహిళలు జలాభిషేకం నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమాలను కుందుర్తి కృష్ణ ప్రసాద్ గురుకుల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

మార్కెట్ కమిటీ పాలకవర్గం బాధ్యతల స్వీకరణ

బాధ్యతలు చేపట్టిన మార్కెట్ కమిటీ చైర్పర్సన్ విజయలక్ష్మి

నేరేడుచర్ల, జూన్ 27 : నేరేడుచర్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ కొత్త పాలకవర్గం గురువారం కొలువు దీరింది. స్థానిక వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో చైర్పర్సన్‌గా బెల్లంకొండ విజయలక్ష్మీనరసింహారావు బాధ్యతలు చేపట్టారు. అనంతరం వైస్ చైర్మన్‌గా తాళ్ల సురేశ్‌రెడ్డి, డైరెక్టర్లుగా కొడాలి పట్టయ్య, ఎల్లంచెర్వు బాల్ రెడ్డి, షేక్. బాలసైదా, నల్లమల్ల రాకేశ్, మచ్చ శ్రీను, అనిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, అందె రామకృష్ణ, పడిగపాటి సైదిరెడ్డి, బండావత్ శ్రీను, దండ సంజీవరెడ్డి, పాలిశెట్టి వినయ్‌కుమార్, గుమ్మడెల్లి సోమయ్య బాధ్యతలు చేపట్టారు. పాలకవర్గానికి నేరేడుచర్ల, పాలకవీడు మండలాధ్యక్షులు కొణతం చిన వెంకట్‌రెడ్డి, ఎన్‌వీ సుబ్బారావు, జడ్పీటీసీ రాపోలు నర్సయ్య, పాలకవీడు ఎంపీపీ భూక్యా గోపాల్, నేరేడుచర్ల మున్సిపల్ చైర్మన్ బచ్చలకూరి ప్రకాశ్, వైస్ చైర్మన్ అలక సరిత, బెట్టె తండా మాజీ సర్పంచ్ మాలోతు మోతీలాల్‌నాయక్, సోమప్ప ఆలయ చైర్మన్ చిత్తలూరి సత్యనారాయణ, కౌన్సిలర్ రణపంగ నాగయ్య, పలువురు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

వైభవంగా శ్రీనివాసుడి శోభాయాత్ర

శ్రీనివాసుడి శోభాయాత్ర నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

హుజూర్‌నగర్, జూన్27 : హుజూర్‌నగర్‌లోని గోదా పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారి శోభాయాత్ర వైభవం నిర్వహించారు. సూర్యప్రభ, గరుడ, చంద్రప్రభ, కల్పవృక్ష, సింహ, గజ వాహనాలపై స్వామివారితో పాటు అమ్మవారు, అల్వార్లను ఊరేగించారు. అనంతరం చక్రస్నానం చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పులిచింతల నారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటనారాయణ, కమిటీ సభ్యులు రంగారెడ్డి, రవీందర్‌రెడ్డి, నర్సిరెడ్డి, ఆనంద్, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్రం ప్రభుత్వం

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నెమ్మాది

సమావేశంలో మాట్లాడుతున్న నెమ్మాది వెంకటేశ్వర్లు

నేరేడుచర్ల, జూన్ 27 : కేంద్ర ప్రభుత్